క్లుప్తంగా

మంత్రి మేరుగ నాగార్జునకు ఘన స్వాగతం



మంత్రి మేరుగ నాగార్జునకు స్వాగతం పలుకుతున్న నాయకులు

తిరుపతి కల్చరల్: తిరుపతి పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు ఏపీ బిషప్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, దర్శ ఇండస్ట్రీ అధినేత ఎం.కిషోర్‌కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్, ఎస్వీయూ పాలక మండలి సభ్యుడు మల్లారపు మధు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు పద్మావతి అతిథి గృహం వద్ద ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

వారపు సంతలో రైతులు, వ్యాపారులకు భోజనం



వారపు సంతలో భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వారపు సంతలో రైతులు, వ్యాపారులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు భోజనాలు పెట్టారు. నియోజకవర్గంలో జరిగే అన్ని వారపు సంతల్లో ఎమ్మెల్యే తన సొంత నిధులతో భోజనాలు సరఫరా చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్టు నాయకులు వివరించారు. కష్టాల్లో ఎమ్మెల్యే కుటుంబం తమకు అండగా ఉందని, వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి రుణం తీర్చుకుంటామని స్థానికులు తెలిపారు.

పోలీసుల అదుపులో అసోసియేట్ ప్రొఫెసర్



ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌లో ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్ రెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ జాగ్రఫీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ రెడ్డి భాస్కర్ రెడ్డిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసన తెలుపుతున్న అకడమిక్ కన్సల్టెంట్లకు ఆయన మద్దతు తెలిపారు. ఈ క్రమంలో ఆయనను యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై అసోసియేట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ తాను రెండు రోజుల నుంచి నగరంలో లేనని, తన స్వస్థలం కడపకు వెళ్లి సోమవారం మధ్యాహ్నం తిరుపతికి వచ్చానని తెలిపారు. తనపై ఆరోపణలు వున్నాయంటూ పోలీసులు స్టేషన్‌కు తీసుకురావడం బాధాకరమన్నారు. పోలీసులు ఆయనను విచారించి వదలిపెట్టనున్నట్లు తెలుస్తోంది.

వైభవంగా చెల్లాతమ్మ ఉత్సవం



సత్యవేడు: మండలంలోని మల్లవారిపాళెం వెస్ట్ పంచాయతీలో చెల్లాతమ్మ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం రాత్రి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు సోమవారం ఉదయం వరకు సాగింది. ఊరేగింపు సందర్భంగా వీధుల్లో విద్యుత్‌దీప అలంకరణ చేట్టారు. మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుస్తూ భక్తులు అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపుగా వచ్చిన అమ్మవారికి ఇంటింటా హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. అమ్మవారి జాతర సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.

ఉదయ రవిచంద్రికలు



వినువీధిలోని మబ్బులు దొంతరలుగా ఏర్పడ్డాయి. ఉదయభానుడి లేత కిరణాలతో వెండి సంద్రంలా.. నందీశ్వరుడికి పందిరి వేసినట్టుగా కనువిందు చేశాయి. ఈ దృశ్యం తిరునగరిలోని శ్రీకపిలేశ్వర స్వామి ఆలయం వద్ద నంది కూడలిలో కనిపించింది. స్థానికులు తమ సెల్‌ఫోన్లలో బంధించుకుని మురిసిపోయారు.

–కేతారి మోహన్ క్రిష్ణ, సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

టీటీడీ చైర్మన్ భూమనకు సత్కారం



తిరుపతి మంగళం: ఉన్నత పదవులు కల్పించిన టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన నేపథ్యంలో ఆయన సోమవారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు.

ఆర్‌పీఈఐ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను విడదల చేస్తున్న వీసీ రాజారెడ్డి, రేర్ ఎర్త్ సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్, రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ(ఆర్‌ఏఈఐ) సంయుక్తంగా వచ్చే నెల 23న మెటీరియల్ సైన్స్ అండ్ రేర్ ఎర్త్‌కు సంబంధించి స్పెక్ట్రోస్కోపిక్ టెక్నిక్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నాయి. ఈ మేరకు వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ రాజారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, ఆర్‌ఏఈఐ కార్యదర్శి ఎంఎల్‌పీ రెడ్డి, డీన్ ఎస్.విజయభాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, ఫిజిక్స్ హెడ్ ఆర్.పి.విజయలక్ష్మి, వర్క్‌షాప్ కన్వీనర్ బి.దేవ ప్రసాద్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు చంద్రశేఖర్, కమలా శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం



ప్రజా ఫిర్యాదులను వింటున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: స్పందనకు వచ్చే ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 19, స్పందనకు 20 ఫిర్యాదులు అందాయి. అనంతరం ఆమె వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందనకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వివరించారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ శానిటేషన్, ఇంజినీరింగ్ పనులు అసంపూర్తిగా వదిలేయడం, యూడీఎస్ తదితరాలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. లక్ష్మీపురం సర్కిల్‌లో అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతుండడంతో ఆ ప్రాంతంలో మూడు నెలలుగా దుకాణాలు మూతపడ్డాయని, వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే బాబు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు కేఎల్ వర్మ, సేతు మాధవ్, సెక్రటరీ రాధిక పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఎస్వీసీసీ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి సిటీ: గత నెలలో విడుదల చేసిన డిగ్రీ మూడో సంవత్సరం 6వ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ కళాశాల విద్యార్థులు అనేక మంది యూనివర్సిటీ స్థాయిలో డిస్టింక్షన్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజ తెలిపారు. బీకాం కంప్యూటర్స్‌లో అమ్మాజాన్ 8.77, సుస్మిత 8.52, వి.శివకుమార్ 8.07 పాయింట్లు సాధించి టాపర్లుగా నిలిచారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్, అధ్యాపకులు అభినందించారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు



గ్రామస్తులకు పథకాల గురించి వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం చంద్రప్పనాయుడు కండ్రిగ, పుల్లమనాయుడు కండ్రిగ, పిళ్లారికోన, రెడ్డిండ్లు, నెత్తకుప్పం ఏఏడబ్ల్యూ గ్రామాల్లో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానంద రెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్ రెడ్డి, మునీంద్రబాబు, రాజేష్, డివిజన్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, బాబు యాదవ్ పాల్గొన్నారు.

తలకోన సిద్ధేశ్వర స్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో శ్రీ సిద్ధేశ్వరస్వామివారు, శ్రీ సిద్ధేశ్వరి అమ్మవారు

భాకరాపేట: తలకోన సిద్ధేశ్వరి, సిద్ధేశ్వర స్వామికి సోమవారం విశేష పూజలు చేశారు. వేకువ జామున సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకం, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి స్వామి, అమ్మవారికి నంది వాహన సేవ నిర్వహించారు. భక్తులకు ఆలయ చైర్మన్, ఈవో, సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సుమన్ జన్మదిన వేడుకలు

తిరుపతి కల్చరల్: ప్రముఖ సినీ నటుడు సుమన్ జన్మదిన వేడుకలను సోమవారం సుమన్ యువ సేన రాష్ట్ర అధ్యక్షుడు పి.నారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నిఖిత హాస్టల్ నిర్వాహకుడు చిన్ని రాయల్, పి.నాగరాజు, దళిత విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు శంకర్, ఓబీసీ విద్యార్థి సంఘం నేత వెంకటాద్రి యాదవ్, సుధాకర్ మాదిగ, యుగంధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా దేశ్ పాండే ప్రమాణ స్వీకారం



దేశ్ పాండేకు ప్రసాదాలు అందజేస్తున్న తిరుపతి జేఈవో వీరబ్రహ్మం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడిగా కర్ణాటకకు చెందిన రఘునాథ్ విశ్వనాథ్ దేశ్ పాండే సోమవారం శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న టీటీడీ బోర్డు సభ్యుడు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సోమవారం టీటీడీ బోర్డు సభ్యుడిగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన రఘునాథ్ విశ్వనాథ్ దేశ్ పాండే కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు తీర్థ ప్రసాదాలతో సత్కరించారు.

డీపీఓ ఆకస్మిక తనిఖీ

రేణిగుంట: స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం డీపీవో రాజశేఖర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పన్ను బకాయిల వసూళ్లను పూర్తి చేయాలని పంచాయతీ ఈవో రవి శేఖర్‌రెడ్డిని ఆదేశించారు. పంచాయతీ నిధుల సమీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేషం, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఈవో రవిశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, వార్డు సభ్యులు ఇరానీ ఖాదర్, ఖదీర్ తదితరులున్నారు.

సీఎంను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



నగరిలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సోమవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనను వైఎస్సార్ సీపీ నాయకుడు ఆదం ప్రసాద్ రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు వి.హరిప్రసాద్‌రెడ్డి కలిశారు. వారిని సీఎం ఆప్యాయంగా పలకరించారు.

–తిరుపతి సిటీ / తిరుపతి మంగళం

మంత్రి పెద్దిరెడ్డికి హేమసుందర్‌రెడ్డి కృతజ్ఞతలు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న హేమసుందర్‌రెడ్డి

తిరుపతి మంగళం: వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మూగ హేమసుందర్‌రెడ్డి సోమవారం మారుతీనగర్‌లోని మంత్రి నివాసంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి రుణపడి ఉంటానని చెప్పారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. టీటీడీ మాజీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, కాణిపాకం ఆలయ కమిటీ సభ్యుడు నరిసింహులుశెట్టి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.ఎస్.రెడ్డి, కుమారస్వామినాయుడు పాల్గొన్నారు.

సహదేవరెడ్డికి టీటీడీ చైర్మన్ నివాళి



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి 21వ డివిజన్ ఎంఆర్ పల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొత్తపాటి మనోహర్‌రెడ్డి సోదరుడు సహదేవరెడ్డి మృతిచెందారు. టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి సోమవారం ఎమ్మార్‌పల్లికి చేరుకుని ఆయన భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎస్వీ ఆయుర్వేద వైద్య విద్యార్థికి జేఈవో అభినందన



ఆయుర్వేద వైద్య విద్యార్థి ఎస్ శ్రీకర్ భరద్వాజను అభినందిస్తున్న జేఈవో సదా భార్గవి

తిరుపతి తుడా: ఆయుర్వేద వైద్య పరిశోధనలో ప్రతిభ కనబరిచిన ఎస్వీ ఆయుర్వేద వైద్య కళాశాల విద్యార్థి డాక్టర్ ఎస్.శ్రీకర్ భరద్వాజను టీటీడీ జేఈవో సదా భార్గవి సోమవారం తమ కార్యాలయంలో అభినందించారు. ఆయుర్వేద వైద్య శాస్త్రంలో భారతదేశంలోనే ఉన్నత పరిశోధనా సంస్థ అయిన న్యూఢిల్లీలోని సీసీఆర్ఏఎస్ (సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చి ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్) సంస్థ ఆయుర్వేద వైద్య విద్యార్థుల్లో పరిశోధనపై అవగాహన పెంచి ప్రోత్సహించడానికి స్పార్క్ (స్టూడెంట్‌షిప్ ప్రోగ్రామ్ ఫర్ ఆయుర్వేద రీసెర్చ్ కేంద్రం) అనే పరిశోధన ప్రాజెక్టును 2022లో ప్రారంభించింది. దేశం మొత్తంలో 100 మంది విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించారు. ఇందులో ఎస్వీ ఆయుర్వేద కళాశాల విద్యార్థి శ్రీకర్ భరద్వాజ చోటు దక్కించుకున్నారు. ఈ విద్యార్థి 'వాతరక్తం అనే వ్యాధిలో వాసాదిక్వాథం ఏరండ బీజ లేపము, క్షీరసేకం అనే ఆయుర్వేద ప్రక్రియల ప్రయోజనం' అనే అంశంపై కాయ చికిత్స ప్రొఫెసర్ డాక్టర్ జ్ఞానప్రసూన పర్యవేక్షణలో చేసిన ఆయుర్వేద పరిశోధనకు ఉత్తమ పరిశోధనగా గుర్తింపు లభించింది. ఇందుకు గాను సీసీఆర్ఏఎస్ సంస్థ రూ.50 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరం, ప్రొఫెసర్ జ్ఞానప్రసూన పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌పై బీజేపీ నేతల విమర్శలు విడ్డూరం

తిరుపతి కల్చరల్: ధార్మిక సంస్థ టీటీడీపైనా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిపైనా బీజేపీ నేతలు పురందేశ్వరి, సోము వీర్రాజు విమర్శలు చేయడం విడ్డూరమని తిరుపతి స్థానిక హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు డీఎంసీ.భాస్కర్ ఒక ప్రకటనలో ఖండించారు. ఇటీవల కొంతమంది సన్యాసులు టీటీడీ చైర్మన్ భూమనను నాస్తికుడని, క్రిస్టియన్ అని లేనిపోని ఆరోపణలు చేస్తూ శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. భూమన కరుణాకరరెడ్డి శ్రీవారి పరమ భక్తుడిగా టీటీడీలో అనేక కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. తప్పుడు ఆరోపణలు మానుకోవాలని, లేని పక్షంలో ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

వినాయక సాగర్ పనుల పరిశీలన



వినాయక సాగర్‌పై సూచనలు చేస్తున్న హరిత

తిరుపతి తుడా: వినాయక సాగర్ పనులను మరింత వేగవంతం చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం అధికారుల తో కలిసి వినాయక సాగర్ పనులను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. వినాయక సాగర్‌లో ఉండే సౌకర్యాలను తెలుపుతూ డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అమ్యూజ్‌మెంట్ పార్క్, రెస్టారెంట్, బోటింగ్ పాయింట్ల ఏర్పాటు పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట ఎస్ఈ మోహన్, డీఈ విజయ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

తిరుపతి కల్చరల్: బషీర్ బాగ్ ఉద్యమ స్ఫూర్తితో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్ తెలిపారు. 2000లో హైదరాబాద్ బషీర్ బాగ్‌లో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పోలీసుల కాల్పుల్లో అమరులైన బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణకు సోమవారం సీపీఎం కార్యాలయంలో సీపీఎం, సీపీఐ సంయుక్తంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి తీవ్ర భారం మోపారని తెలిపారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణలను ప్రజలపై రుద్దారని పేర్కొన్నారు. చార్జీల పెంపుపై ఆనాడు హైదరాబాద్ బషీర్ బాగ్‌లో 10 వామపక్ష పార్టీలు మిలిటెంట్ పోరాటం సాగించినట్టు తెలిపారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతిచెందారని, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, నాయకులు కందారపు మురళి, పుల్లయ్య, జనార్థన్, మాధవ్, జయచంద్ర, సుబ్రమణ్యం, సాయిలక్ష్మి, రైతు సంఘ నేత హేమలత పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు



రక్త పరీక్షలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీవో

పాకాల: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల లోని విద్యార్థులకు సోమవారం ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. దామలచెరువు, గాదంకి, మొగరాల జెడ్పీ హైస్కూళ్లతోపాటు పాకాల–1, పాకాల–2, పదిపుట్లబైలు ఎంపీయూపీ స్కూళ్లలో 1,129 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. 1,090 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్, ఎంఈవో బాబ్జీ పాల్గొన్నారు.

పరాశరేశ్వర ఆలయంలో వైభవంగా కలశస్థాపన



అంకురార్పణ చేస్తున్న ఆలయ అర్చకులు

తిరుచానూరు(చంద్రగిరి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా యోగిమల్లవరంలోని కామాక్షి సమేత పరాశరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి కలశ స్థాపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ పౌర్ణమి సందర్భంగా మూడు రోజులు విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం రాత్రి అంకురార్పణ, కలశ స్థాపన, వాస్తు హోమం చేపట్టారు. ఆలయ ధర్మకర్త శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మంగళవారం ఉదయం, రాత్రి లక్ష బిల్వార్చన, బుధవారం పౌర్ణమి సందర్భంగా మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి సహకారంతో అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



ఫ్యాన్లు అందజేస్తున్న ప్రకాశం శెట్టి

ఫ్యాన్లు వితరణ

యోగిమల్లవరంలోని కామాక్షి సమేత పరాశరేశ్వర స్వామి ఆలయానికి తిరుచానూరుకు చెందిన నాళం ప్రకాశం శెట్టి మూడు ఫ్యాన్లు వితరణ చేశారు. వాటిని సోమవారం సాయంత్రం ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డికి అందజేశారు. ఈఓ మమత పాల్గొన్నారు.